క్లుప్తంగా

దేవస్థానం భూముల కౌలు వేలం ఖరారు

కాజులూరు: గొల్లపాలెంలో పురాణ ప్రసిద్ధిగాంచిన బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 7.75 ఎకరాల సాగు భూమి మూడేళ్ల కౌలుకు మంగళవారం వేలం పాట ఖరారైనట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ పి.వి.ఎస్.సూర్యనారాయణరాజు తెలిపారు. ఆలయ సింగిల్‌ట్రస్టీ, ఈఓ అధ్యక్షతన ఆలయంలో వేలం పాట నిర్వహించారు. గ్రామంలో స్వామివారికి ఉన్న 4.48 ఎకరాల పల్లం భూమికిని ఊడా రాఘవరావు అనే రైతు సంవత్సరానికి రూ.1.61లక్షలకు పాటను దక్కించుకున్నారు. స్వామివారికి చెందిన 3.37 ఎకరాల మెరక భూమిని పబ్బినీడి శ్రీనివాసు రూ.12,900లకు పాట దక్కించుకున్నట్టు ఈఓ సూర్యనారాయణరాజు తెలిపారు.

ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

కె.గంగవరం: లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఎస్. శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని అముజూరులో మంగళవారం ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ ప్రక్రియను వెంటనే చేపట్టాలని ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలన్నారు. గృహనిర్మాణ శాఖ ఏఈ భాస్కరరావు, సర్పంచ్ నానాపరపు కల్యాణి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సీతారామయ్య చౌదిరి తదితరులు పాల్గొన్నారు.

బాల ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

కపిలేశ్వరపురం: మండలంలో కొనసాగుతున్న బాల ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. కపిలేశ్వరపురం, వల్లూరులలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, కోరా దొరబాబు 13 చొప్పున మొత్తం 26 మంది చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పడమర ఖండ్రిక, నల్లూరు గ్రామాల్లో బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. ఆయా కేంద్రాల్లో బాల ఆధార్ కార్యక్రమంతో పాటు సాధారణ డాక్యుమెంటేషన్ నవీకరణ చేస్తారన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లి, అముజూరు, సుందరపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఎంపీడీఓ ఎన్.శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు అర్హులైన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, వేతనాలకు సరైన సమయంలో అందేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. వేసవితో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఉపాధి కూలీలకు మంచీ నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రామంలోని చెరువు పూడిక తీత పనులు తీయడంతో పాటు చెరువు చుట్టు ఉన్న చెత్తను తొలగించాలని ఎంపీటీసీ సభ్యుడు తాడల జానికిరామయ్య(రాజు) ఎంపీడీఓకు విన్నవించుకున్నారు. సర్పంచ్ సలాది శిరీష, పెద్దలు తంబయ్య(సాదు) తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయ్‌కు సేవారత్న అవార్డు



జాతీయ మాలమహానాడు నాయకుల నుంచి అవార్డు అందుకుంటున్న నిమ్మితి విజయ్

కాజులూరు: గొల్లపాలెంకు చెందిన ఆంధ్ర మాలమహానాడు మండల కన్వీనర్, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగా కార్యదర్శి నిమ్మితి విజయ్‌కు సేవారత్న అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లడుతూ కాకినాడ జ్యోతిరావ్ పూలే మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన మాలల మల్లయుద్ధభేరి జాతీయ సభలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జిల్లా అధ్యక్షుడు వింత సురేష్ చేతుల మీదుగా తనకు అవార్డు అందజేశారన్నారు. జిల్లాలో సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి తాను చేస్తున్న పోరాటాల ఫలితంగా తనను సంఘ నాయకులు ఈ అవార్డుకు ఎంపిక చేశారన్నారు.

నోరూరించే పండ్లు.. విషం దాగుండు

- మార్కెట్‌లో మామిడి పండ్లు సిద్ధం
- మగ్గబెట్టేందుకు రసాయనాల వినియోగంతో విషతుల్యం
- రైపెనింగ్ చాంబర్ల ఏర్పాటు పరిష్కారం



కపిలేశ్వరపురం: తీసుకునే ఆహారంలో పండ్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. క్షేత్ర స్థాయి సమావేశాల ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారానూ పండ్ల ప్రాధాన్యతపై న్యూట్రిషియన్లు అవగాహన కల్పిస్తుంటారు. సాత్వికాహారాన్ని తీసుకునేవారు రోజు మొత్తంలో పండ్లను ఎక్కువ భుజిస్తారు. ఇదంతా ఆరోగ్యకరమైనదే. అయితే తినే ఫలాల్లో ఆరోగ్యశాతమెంత అన్న ప్రశ్న వినియోగదారులను వేధిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడిపండ్లు విక్రయాలకు సిద్ధంగా ఉన్నాయి. ఆ పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్, ఇథీఫాన్ లిక్విడ్‌లను వినియోగిస్తుండడంతో ఆలవి విషతుల్యం అవుతున్నాయి. పోషకాలతో పాటు విష పదార్థాలు కూడా శరీరంలోకి వెళ్లడం ద్వారా ఆరోగ్యం దెబ్బతింటుంది.

రెండు నియోజకవర్గాల్లో పండ్ల ఉత్పత్తి ఇలా..

దివాన్ చెరువు, రావులపాలెం నుంచి తెచ్చిన పండ్లను రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు ఆయా నియోజకవర్గాల గ్రామాల్లో వ్యాపారులు విక్రయిస్తున్నారు. స్థానిక వ్యవసాయ క్షేత్రాలతో పాటు ఇతర ప్రాంతాల పండ్లను ఆయా మార్కెట్లలో విక్రయిస్తున్నారు. మండపేట నియోజకవర్గంలో 60, ఇతర కోనసీమ ప్రాంతంలో 90 మొత్తం 150 ఎకరాల్లో మామిడి ఉత్పత్తి అవుతుంది. అరటి ఉత్పత్తి కొత్తపేట మండలంలో 2,890 ఎకరాలు, రావులపాలెం మండలంలో 3,242, ఆత్రేయపురం మండలంలో 3,948, కపిలేశ్వరపురం మండలంలో 667, మండపేట మండలంలో 71, ఆలమూరు మండలంలో 1,100 మొత్తం 11,918 ఎకరాల్లో అరటి ఉత్పత్తి అవుతోంది. నున్న, రాజోలు ప్రాంతాల నుంచి మామిడి, ఏలేశ్వరం నుంచి అరటి దిగుమతి అవుతుంది.

సహజసిద్ధంగా మగ్గిన పండును గుర్తించండిలా.

సహజసిద్ధంగా మాగిన మామిడి పండ్లు రంగు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వత చెంది ఉంటుంది. కమ్మని వాసనను మనం దూరంగా ఉన్నప్పటికీ గ్రహించ గలుగుతాం. సహజ సిద్ధమై తీపి ఎక్కువగా ఉంటుంది. రసాయనాలతో మాగించిన పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటుంది. పైకి మాగినట్టు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటుంది. కమ్మని వాసన ముక్కుదగ్గర ఉంచినప్పుడు మాత్రమే వస్తుంది. తక్కువ తీపి ఉంటుంది.

రసాయనాల వినియోగం ఇలా...

వ్యవసాయ క్షేత్రం నుంచి వినియోగదారుడికి పండ్లు చేరే మధ్యలో మార్కెట్ కీలకమైంది. చెట్టుమీదే పండు మగ్గిన తినడం అనేది దాదాపు అసాధ్యం. పచ్చిగా ఉండగానే వాటిని ప్రకృతి సిద్ధంగా మాగబెట్టి మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంది. అయితే సమయానుకూలత వల్ల దళారులు రసాయనాల వినియోగం ద్వారా పండ్లను మాగబెడుతున్నారు. మామిడి పండ్లకు కాల్షియం కార్బైడ్, అరటికి ఇథెఫాన్ లిక్విడ్‌లను స్ప్రే చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా మార్కెట్‌కు, రైతుకు మధ్య ఉన్న దళారీలే చేస్తున్నారు.

విజిలెన్స్ దాడులు

పండ్లను రసాయనాలతో మాగబెట్టి అమ్మడంపై విజిలెన్స్ శాఖ దాడులు నిర్వహించి కేసులను నమోదు చేస్తోంది. రసాయనాలు వినియోగించారా లేదా అనేది ఉద్యానశాఖాధికారులు నిర్ధారించగా సంబంధిత అధికారులు చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటారు. పండ్లు విషతుల్యం కాకుండా ఉండేందుకు ప్రకృతి సిద్ధమైన రైపెనింగ్ చాంబర్లలో పండ్లను మాగబెట్టి విక్రయించడం మేలు.

అప్రమత్తంగా ఉండాలి



పండ్ల విక్రయాల్లో రసాయనాలను వినియోగించడాన్ని అరికట్టేందుకు పలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో కృషి చేస్తున్నాం. ప్రకృతి సిద్ధంగా పండిన పండ్లు ఆరోగ్యానికి దోహద పడతాయి. వినియోగదారులు అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యానిచ్చే పండ్లను మాత్రమే తినాలి.
మంకు అనూష, ఏఓ,
ఉద్యాన శాఖ, కపిలేశ్వరపురం

జగనన్నే మా భవిష్యత్తుకు అపూర్వ స్పందన

రామచంద్రపురం రూరల్: చోడవరంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్లు పిల్లి రాఘవ, కాంట్రకోట దుర్గ, నేమాల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి అపూర్వ స్పందన ఉన్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాదే అర్జున, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: మండలంలోని 33/11 కేవీ రామచంద్రపురం పట్టణ 11 కేవీ ఓదూరు ఫీడర్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పట్టణ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ మంగళవారం తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థినికి మూడో ర్యాంకు

రామచంద్రపురం రూరల్: నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని గెద్దం తనూజ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన గోదావరి రామాయణ టాలెంట్ టెస్ట్ 2022–23 పోటీల్లో మూడో ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి మంగళవారం తెలిపారు. ఈ మేరకు తనూజను, సర్టిఫికెట్లు సాధించిన మిగిలిన విద్యార్థులను పలువురు అభినందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ రెడ్డి రాజారమేష్, సభ్యులు వారణాసి సత్తిబాబు, లోవరాజు, ఉపాధ్యాయులు పద్మావతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

గేటెడ్‌కు దీటుగా జగనన్న కాలనీలు

- మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వేములపల్లి జగనన్న కాలనీలో సబ్ స్టేషన్‌కు భూమి పూజ



సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి

మండపేట: గేటెడ్ కమ్యూనిటీలకు దీటుగా జగనన్న కాలనీలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ద్వారపూడి శివారు వేములపల్లి జగనన్న కాలనీలో రూ. 2.8 కోట్లతో నిర్మించే సబ్‌స్టేషన్‌కు కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు, యువనేత తోట పృథ్వీరాజ్, రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు తదితరులతో కలిసి మంగళవారం ఎమ్మెల్సీ త్రిమూర్తులు భూమిపూజ చేశారు. ద్వారపూడి సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడారు. నియోజకవర్గంలో 9,700 మంది పేదలకు ఇళ్లు మంజూరవ్వగా 9,000 వరకు నిర్మాణాలు మొదలయ్యాయన్నారు. వాటిలో కొన్ని పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మండపేట పట్టణ, మండలంలని వివిధ గ్రామాల్లోని ఐదు వేలకు పైగా లబ్ధిదారులకు వేములపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ధవళేశ్వరం వద్ద నుంచి పైప్‌లైన్ల ద్వారా గోదావరి జలాలను తీసుకు వచ్చి శుద్ధిచేసి ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా ఈ కాలనీలోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వేములపల్లి కాలనీ–2కు విద్యుత్ వెలుగులు

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి కృషితో వేములపల్లిలో సుమారు 1600 ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. తర్వాత టీడీపీ ప్రభుత్వం కొన్ని ఇళ్ల నిర్మాణం చేసినప్పటికి విద్యుత్ సదుపాయం కల్పించలేకపోయిందన్నారు. అంధకారంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ. 1.5 కోట్లతో కాలనీ అంతటికీ విద్యుత్ సదుపాయం కల్పించామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. సోమేశ్వరంలో సబ్‌స్టేషన్ నిర్మాణం త్వరలో పూర్తి కానుందన్నారు. విద్యుత్ సమస్యలపై ఆశాఖ ఎస్ఈ టీఎస్ఎన్ మూర్తి, డీఈ దాట్ల శ్రీధరవర్మ, ఏడీఈ జి. తిరుమలరావు సత్వరమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ తోట అభినందించి వారిని సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



ఆదిశంకరాచార్యుల జయంతిలో భక్తులు

రామచంద్రపురం రూరల్: జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతిని కామాక్షీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ద్రాక్షారామ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భక్తులకు స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దమరసింగు సత్యవతి, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొసనా కామేశ్వరరావు, ద్రాక్షారామ సంఘం అధ్యక్షుడు కొసనా భీమశంకరం, కార్యదర్శి దాకోజు శ్రీనివాస్, కాల్దారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో..

దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదిశంకరాచార్యుల జయంతిని ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శృంగేరీ పీఠం నుంచి తీసుకుని వచ్చిన బాణలింగంకు ప్రథమాభిషేకం, పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వయంగా మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ స్వామివిగ్రహానికి గ్రామోత్సవం జరిపించారు. మాణిక్యాంబా అమ్మవారికి ప్రతీకరమైన గూడా అన్నం, దద్ధోజనం, చక్ర పొంగలి అమ్మవారికి నివేదనగా సమర్పించి భక్తులకు ప్రసాదంగా అందించారు. ఆది శంకరాచార్యుల జీవిత చరిత్ర ప్రసంగం, సంగీత కచేరి తదితర ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు

- ఎల్‌హెచ్‌ఎంఎస్ డివైస్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లాపై అవగాహన పెంచుకుంటున్నా
- జిల్లా ఎస్పీ శ్రీధర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీధర్

రాయవరం: తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, చాలా వరకూ ప్రమాదాలు మైనర్ల వల్లే సంభవిస్తున్నాయని జిల్లా ఎస్పీ ఎస్. శ్రీధర్ అన్నారు. రాయవరం పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులపైనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈత సరదాతో పలువురు ఇటీవల కాలువలు, నదుల్లోకి దిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. తమ పిల్లలను ఒక కంట కనిపెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. జనసమ్మర్ధం ఉన్న నది, కాలువల రేవుల వద్ద బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, సెలవుల్లో గ్రామాంతరం వెళ్లే వారు ఎల్‌హెచ్ఎంఎస్ డివైస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాపై పూర్తి స్థాయి అవగాహన ఏర్పరుచుకునేందుకే జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లను సందర్శిస్తున్నానన్నారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ తన ప్రాధాన్యమని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బందితో ఎస్పీ మాట్లాడారు. స్టేషన్ పరిధిలోని కేసుల ప్రగతిని ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి, మండపేట రూరల్ సీఐ శివగణేష్ ఉన్నారు.

అవగాహనే ఆయుధంగా మలేరియాపై పోరు



అంగరలో ర్యాలీ చేస్తున్న డాక్టర్ రత్నకుమారి, వైద్య ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: అవగాహననే ఆయుధంగా చేసుకుని మలేరియా వ్యాధి వ్యాప్తిని నిలువరించాలని మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవంలో పాల్గొన్న వక్తలు అన్నారు. అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం, వానపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అంగర, పడమర ఖండ్రిక, అద్దంకివారిలంక, కేదారిలంక, అచ్యుతాపురం తదితర గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు మానవహారంగా నిలిచి వ్యాధి నివారణకు నినాదాలు చేశారు. గ్రామ సచివాలయాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు. వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి మాట్లాడుతూ ఎంతటి మహమ్మారి రోగాన్ని అయినా ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ పి.సురేష్, ఎల్‌టీ ఆలీ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

మండపేట: మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో దోమల నిర్మూలనకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, కమిషనర్ టి. రామ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య పట్టణంలోని పలు వార్డుల్లో ఫాగింగ్ చేయించారు.

రామచంద్రపురం మండలంలో...

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మలేరియా నివారణ దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సందీప్‌నాయుడు, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ మమత, డాక్టర్ ఆదినారాయణ నేతృత్వంలో వైద్య సిబ్బంది, ఆశాలు ర్యాలీ నిర్వహించారు.

వాహనాల వేలం

రామచంద్రపురం: వివిధ కేసుల్లో పట్టుకున్న 11 మోటారుసైకిళ్లకు బుధవారం ఉదయం 10 గంటలకు ఆలమూరు స్టేషన్ వద్ద వేలం నిర్వహించనున్నట్టు రామచంద్రపురం ఎస్ఈబీ ఎస్సై ఇ.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ధరావత్తుగా రూ.2 వేలు జమ చేయాలన్నారు. వేలంలో వాహనం దక్కించుకున్నవారు మొత్తం సొమ్ము వెంటనే చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 95338 75753, 91609 88844నంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



గొల్లపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

కాజులూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, గొల్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి అన్నారు. మంగళవారం గొల్లపాలెం ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏసురాజు, శ్రీరామారెడ్డి సంయుక్తగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆర్‌బీకే కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు గోనె సంచులు, కూలీలు, రవాణా చార్జీలతోపాటు పంట సొమ్ములు 21 రోజుల వ్యవధిలో వారి బ్యాంకు ఖాతాకు జమవుతాయన్నారు. దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మూలారెడ్డి, ఎంపీటీసి సభ్యులు జొన్నకూటి పద్మావెంకటేశ్వర్రావు, పోతురాజు బాబూరావు, మాత నాగరాజు, వీఏఏ వనుం శ్రీరమ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆధునిక వైద్య విధానాలు అందిపుచ్చుకోవాలి

మండపేట: వైద్య విధానంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను పీఎంపీలు అంది పుచ్చుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాజమహేంద్రవరానికి చెందిన పలువురు వైద్య ప్రముఖులు పేర్కొన్నారు. మండపేట పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కోన సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం స్థానిక వల్లూరి నారాయణమూర్తి కల్యాణ మండపంలో అవగాహన సదస్సు జరిగింది. డెల్టా ఆస్పత్రి సర్జికల్ అంకాలజిస్ట్ సుమంత్ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాథమిక దశలో గుర్తిస్తే నేటి నూతన వైద్య విధానాలతో చక్కటి వైద్య సేవలందించవచ్చనన్నారు. న్యూరో సర్జన్ గీతా శ్రవణ్ మాట్లాడుతూ అధిక రక్త పోటు, మధుమేహం, మానసిక ఒత్తిడులే పక్ష వాతానికి కారణమన్నారు. అనంతరం వైద్యులను అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, నాయకులు ఎస్వీ రమణ, సూరంపూడి వీరభద్రరావు, బీవీ రమణ, వీకే రాజు, అడ్డాల శ్రీనివాస్, మండపూడి చంద్రశేఖర్ తదితర 160 మంది హాజరయ్యారు.

పాలనకు ప్రజలు బ్రహ్మారథం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- 'జగనన్నే మా భవిష్యత్తు' విజయవంతం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ తోట

మండపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఘన విజయం సాధించడం ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకురాలు, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి,పార్టీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు, పార్టీ నేతలతో కలిసి మండలంలోని వేములపల్లిలో మంగళవారం ఎమ్మెల్సీ తోట మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏడు లక్షల మంది గృహ సారథులు, పార్టీ నేతలు, కార్యకర్తలు రెండు వారాల్లో కోటి కుటుంబాలకు పైగా సందర్శించి ప్రజలతో మమేకమయ్యారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పీపుల్స్ సర్వేకు అపూర్వ స్పందన లభించిందని చెప్పారు. దాదాపు 1.75 కోట్లకు పైగా మిస్డ్‌కాల్స్ ద్వారా ప్రభుత్వానికి ప్రజలు తమ మద్దతు తెలియజేశారన్నారు. సామాన్యులు జగన్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారని ఎమ్మెల్సీ తోట అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు అండగా పేద మధ్య తరగతి ప్రజలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- నల్లూరులో గడప గడపకూ ..



నల్లూరు గ్రామస్తుల సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజల ఆశీస్సులే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వారికోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మండలంలోని నల్లూరులో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ తోటను గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, మండల సాగునలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ , వైఎస్సార్ సీపీ యువనేత, ఎమ్మెల్సీ తనయుడు తోట పృథ్వీ, గ్రామ అధ్యక్షుడు కురుపూడి శివశంకర్, నాయకులు కురుపూడి రాంబాబులతో కలిసి ఇంటింటి పర్యటన చేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమక్షంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై స్పష్టత ఇచ్చారు. సాంకేతిక సమస్యలతో ప్రభుత్వ లబ్ధి మంజూరు నిలిచిపోతే వెంటనే తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారుల ద్వారా సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ తోట భరోసా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సచివాలయం, ఆర్బీకే, పాలశీతలీకరణ భవనంతో పాటు కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణాలు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వల్లూరి పెద్దబ్బు, చేనేత సహకార సంఘం చైర్మన్ సిద్ధాని సూరిబాబు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

రామచంద్రపురం: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం 3.30 గంటలకు నిర్వహించాల్సిన మున్సిపల్ అత్యవసర సమావేశం అనివార్య కారణాలతో రేపు ఉదయం 11 గంటలకు వాయిదా వేసినట్టు రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించాలన్నారు.

సామాజిక తనిఖీ ప్రాధాన్యతను గుర్తించాలి



ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ తాతారావు

కపిలేశ్వరపురం: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో సామాజిక తనిఖీ ప్రాధాన్యతను గుర్తించాలని ఎంఈఓ కె.తాతారావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మంగళవారం ఆయన అధ్యక్షతన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ తరగతి నిర్వహించారు. ఈనెల 29 లోగా పాఠశాలల పీఎంసీ సమావేశాలను నిర్వహించి పాఠశాలల నిర్వహణకు గల అవసరాలపై చర్చించాలన్నారు. సంబంధిత నిర్ణయాలతో కూడిన అంశాలను నిర్దేశించిన యాప్‌లో పొందుపరచాలన్నారు. అందుకోసం రూపొందించిన ప్రశ్నావళిని తల్లిదండ్రుల సమక్షంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఐడి కో–ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, రీసోర్స్ పర్సన్లు ఎ.లక్ష్మీనారాయణ, రాజు మాట్లాడారు.

సమర్థవంతంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ

- జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు
- అంగరలో వీఏఏలతో సమావేశం



అంగరలో వ్యవసాయ సహాయకులకు సూచనలు చేస్తున్న నాగేశ్వరరావు

కపిలేశ్వరపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశాన్ని మంగళవారం అంగర ఆర్బీకేలో నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు అనుగుణమైన రీతిలో ధాన్యానికి గిట్టుబాటు ధరను ప్రకటించిందన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి గిట్టుబాటు ధర కంటే ఎక్కువ ధరకు బహిరంగ మార్కెట్‌లో కొనే పరిస్థితులున్న నేపథ్యంలో రైతులు అమ్ముకోవచ్చన్నారు. అలా అమ్ముకున్న పంట తాలూకు సర్వే నంబర్లను ధాన్యం కొనుగోలు లాగిన్‌లో బ్లాక్ చేయాలన్నారు. అలా బ్లాక్ చేయడం ద్వారా ఓపెన్ మార్కెట్‌లో ధాన్యం విక్రయించుకున్న సర్వే నంబర్లను దుర్వినియోగం చేయకుండా ఉంటారన్నారు. అపరాల పంటను సాగు చేసే రైతులు తమ సాగు వివరాలను పంట నమోదు చేసుకోవాలన్నారు. స్థానిక కొనుగోలు కేంద్రాల నిర్వహణపై మండల వ్యవసాయాధికారి కేవీఎన్ రమేష్‌కుమార్ వివరించారు.